క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరు మహదేవపురం సబ్‌స్టేషన్ పరిధిలో సనత్‌నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానూరులో సనత్‌నగర్, తులసీనగర్, మహదేవపురం కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉయ్యూరు: మండలంలోని కాటూరు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటూరు, కలవపాముల, కడవకొల్లు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని పురుషోత్తపట్నం లైన్ మెయింటెన్స్ వర్క్ నిమిత్తం శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొండపావులూరు, పురుషోత్తపట్నం ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన

కంకిపాడు: జీవనశైలి మార్పులతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని లయన్స్ ప్రతినిధి, క్యాన్సర్ అవగాహన జిల్లా కోఆర్డినేటర్ బొబ్బా హరనాథ్‌బాబు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కంకిపాడు ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హరనాథ్ బాబు మాట్లాడుతూ ఆహార అలవాట్లు, జీవనశైలితోనే అధికంగా క్యాన్సర్ విస్తరిస్తోందన్నారు. విద్యార్థులకు క్యాన్సర్ అవగాహనపై తయారు చేసిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు మద్దుల గోవిందరావు, కంకిపాటి నాగమల్లేశ్వరరావు, హెచ్ఎం కే అరుణకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం



ఉయ్యూరు: ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులను పీఆర్‌టీయూ సత్కరించింది. మండలంలోని కాటూరు జెడ్పీ పాఠశాలలో పీఆర్‌టీయూ అనుబంధ ఉపాధ్యాయ సేవాదళ్ ఆధ్వర్యంలో శుక్రవారం 22 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. గత విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు అభినందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను, రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి రమేష్, జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సైక్లింగ్ పోటీలు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలం నున్న జెడ్పీ హైస్కూల్ ఆధ్వర్యంలో శని, ఆదివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) అంతర్ జిల్లా స్థాయి అండర్-14, 17, 19 బాలబాలికల సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి. భూపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలు జాతీయ రహదారిపై నున్న నుంచి అంబాపురం వరకు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఈ పోటీలు స్కూల్ గేమ్స్ ఎన్టీఆర్ జిల్లా పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు

సాక్షి ఎఫెక్ట్

ఉంగుటూరు: ఎట్టకేలకు రెవెన్యూ యంత్రాంగం ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసింది. పలు సంక్షేమ పథకాల నిమిత్తం 200మంది ఆదాయ ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. 20రోజులు కావస్తున్నప్పటికి ధ్రువీకరణ పత్రాలు మంజూరు కాకపోవడంతో ఈ నెల 24న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలి' అనే శీర్షికకు అధికారులు స్పందించారు. శుక్రవారం ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరుకు శ్రీకారం చుట్టారు. అధికారుల స్పందనపై దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరుస చోరీలతో బెంబేలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడులో జరుగుతున్న వరుస చోరీలతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. గురువారం గ్రామ సచివాలయం తలుపులు బద్దలు కొట్టి కంప్యూటర్ ప్రింటర్, ఇతర సామగ్రి దొంగిలించిన సంఘటన జరగ్గా, మరుసటి రోజునే మరో ఇంట్లో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన పుట్టి దామోదరరావు ఇంట్లో శుక్రవారం తెల్లవారుజామున దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో ఎవ్వరూ లేకపోవడంతో తాళాలు బద్దలు కొట్టి విలువైన సామగ్రితో పరారైయ్యారు. సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మరో పక్క హనుమాన్‌జంక్షన్‌లోనూ గురువారం రాత్రి రోడ్లపై నిలిపి ఉంచిన వాహనాల్లో హ్యాండ్ బ్యాగులను దొంగిలించారు. విజయవాడరోడ్డులోని సెల్ పాయింట్, నూజివీడురోడ్డులోని కూరగాయల షాపుల వద్ద నిలిపి ఉంచిన బైక్‌ల్లో బ్యాగులను దుండగులు అపహరించారు.

'అధికార' నేతల పెత్తనం

- తాడిగడప మున్సిపాలిటీలో హల్‌చల్ చేస్తున్న టీడీపీ నేతలు
- కమిషనర్‌ను టార్గెట్ చేసిన నాయకులు



తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో టీడీపీ నేతలు కాసుల వేటలో పడ్డారు. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునే పనిలో ఉన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సర్కిళ్లలో టీడీపీ నేతలు పెత్తనం చెలాయిస్తూ దందా చేస్తున్నారు. ఇంటి ప్లాన్‌లు, పన్నులు, మున్సిపాలిటీలో ఇతర పనులను ప్రజలు చేయించుకోవాలంటే టీడీపీ నేతల చుట్టూ తిరగాల్సి వస్తోంది. మున్సిపాలిటీలో కొందరు అధికారులు కూడా టీడీపీ నేతలకు వత్తాసు పలుకుతున్నారు. అయితే కొత్తగా వచ్చిన కమిషనర్ భవానీ ప్రసాద్ టీడీపీ నేతల పెత్తనానికి తలొగ్గకపోవడంతో ఆయన్ను టార్గెట్ చేశారు. కమిషనర్ తమ మాట వినడం లేదని అక్కసు వెళ్లగక్కుతున్నారు. వివరాల్లోకి వెళితే.. తాడిగడప మున్సిపాలిటీ పాలన కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అస్తవ్యస్థంగా మారింది. మున్సిపాలిటీ పని తీరును గాడిలో పెట్టాల్సిన పాలకులు అడ్డదారుల వైపు చూస్తుండటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా ఇళ్ల పన్నులు వేయాలంటే టీడీపీ నేతలు, మున్సిపాలిటీ ఉద్యోగుల చేతులు తడిపితేనే పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే ఇంటి ప్లాన్‌లు, బిల్డర్ల అక్రమ దందాలు, అక్రమ లేఅవుట్లు మున్సిపాలిటీలో అడ్డగోలుగా జరుగుతున్నాయి. గ్రామాల్లో టీడీపీ నేతలు ఏరియాల వారిగా పంచుకొని పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేశారు.

కమిషనరే టార్గెట్..

గత మూడు నెలలుగా మున్సిపాలిటీలో టీడీపీ నేతలు హవా చెలాయించారు. అయితే కొత్తగా వచ్చిన కమిషనర్ భవానీప్రసాద్ తనదైన శైలిలో వ్యవహరిస్తుండటంతో టీడీపీ నేతలకు మింగుడు పడటం లేదు. టీడీపీ నేతల కాసుల దందాకు గండి పడటంతో కమిషనర్‌ను టార్గెట్ చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్న వారిని కీలక పదవుల్లో ఉంచాలని సిఫార్సులు చేస్తున్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో గతంలో టీడీపీ నేతలు తిష్ట వేసి కమిషనర్ గదిలో కూర్చొని పైరవీలు చేసుకునే వారు. అయితే కొత్తగా వచ్చిన కమిషనర్ ఈ సంస్కృతికి తెరదించడంతో టీడీపీ నేతలు ఖంగుతిన్నారు. టీడీపీ నేతలు మున్సిపాలిటీ కార్యాలయంలో అడుగు పెట్టడానికి సంకోచిస్తున్నారు. ప్రస్తుత కమిషనర్ ఉంటే తమ ఆటలు సాగవని కత్తులు నూరుతున్నారు.

పాలనపై దృష్టి పెట్టండి..

తాడిగడప మున్సిపాలిటీలో కాసుల దందాను టీడీపీ నేతలు పక్కన పెట్టి పాలనపై దృష్టి పెట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. కాసుల కోసం కీచులాడుకుంటే నమ్ముకున్న ప్రజలు ఏమవ్వాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు ఇళ్లకు ఉన్న పన్నులు పెంచడం కన్నా అసలు పన్నులు లేని ఇళ్లను గుర్తించి పన్నులు వేయాలని ప్రజలు సూచిస్తున్నారు. ప్రజా ఫిర్యాదులు నేరుగా స్వీకరించి జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలని, కొత్తగా ఇంటి పన్ను వేయమని వచ్చే యజమానులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి లంచాలు లేకుండా పన్నులు వేయాలని కోరుతున్నారు. నాలుగు సర్కిళ్లలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి స్థానిక సమస్యలు సత్వరం పరిష్కరించాల్సి ఉంది. అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై కొరడా ఝులిపించాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో మున్సిపాలిటీ పాలన పారదర్శకంగా అమలు చేస్తేనే ప్రజలకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి.

పన్నులు సక్రమంగా చెల్లించాలి



సమగ్ర సర్వేలో వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ భవానీప్రసాద్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఉంటున్న ప్రజలు పన్నులు సక్రమంగా చెల్లిస్తేనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని కమిషనర్ భవానీప్రసాద్ తెలిపారు. తాడిగడప సచివాలయం-4లో శుక్రవారం ఆయన ఫీల్డ్ సర్వేను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో పన్నులు లేని నివాసాలకు పన్ను వేస్తామన్నారు. ఖాళీ స్థలాలకు కూడా పన్నులు వేస్తామన్నారు. భవనాల ప్లాన్‌లు, వాణిజ్య లైసెన్సులు సర్వేలో పరిశీలిస్తామని అన్నారు. పన్నులతో మున్సిపాలిటీకి ఆదాయం సమకూరితేనే రోడ్లు, డ్రెయిన్లు, పారిశుద్ధ్యం, కార్మికులకు జీతాలు ఇవ్వగలుగుతామని అన్నారు. తమ సిబ్బంది చేస్తున్న సర్వేకు సహకరించాలని కోరారు. ఆర్ఐ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసాదంపాడులో ఫ్రైడే-డ్రైడే



అవగాహన కల్పిస్తున్న హెల్త్ అధికారులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు సచివాలయం-2 పరిధిలో శుక్రవారం 'ఫ్రైడే-డ్రైడే' అవగాహన కార్యక్రమాన్ని పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ ఆదేశాల మేరకు జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రై-డేపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా అధికారి మోతీబాబు మాట్లాడుతూ నివాసాల సమీపంలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అన్నారు. మురుగు నీటి నిల్వ వల్ల దోమలు వృద్ధి చెంది అనారోగ్యాలకు కారణమవుతాయని హెచ్చరించారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఆఫీసర్ హెచ్ఈఓ సుబ్రహ్మణ్యం, రామచంద్రుడు, ఎస్‌యూఓ అప్పారావు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన అధికారులకు సత్కారం



బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ బి. భార్గవిని సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలం నుంచి బదిలీపై వెళ్లిన అధికారులకు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయడం ద్వారా ప్రజలకు మంచి పాలన అందించవచ్చునన్నారు. ఈఓఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు, అడ్మినిస్ట్రేషన్ అధికారి ఆనంద కుమారి, సీనియర్ అసిస్టెంట్ కుమారస్వామిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ విజయబాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు టి. భారతి, పి. మురళీమోహనరావు, ఎస్.చెన్నకేశవరావు, మస్తాన్‌రావు, ప్రసాదరావు, ప్రకాష్‌నాథ్, పలువురు మినిస్టీరియల్ సిబ్బందికి సన్మానం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కె. సువర్ణరాజు, ఎంపీడీఓ బి. విగ్గిన్స్, కార్యాలయ సిబ్బంది, జీటివి. రమణ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అనధికార పార్కింగ్‌లు

- ప్రమాదాలు జరుగుతున్నా.. అధికారుల చర్యలు శూన్యం



రామవరప్పాడు బల్లెంవారి వీధిలో నిలిపిన లారీలు, ప్రయివేట్ బస్సులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో అనధికార పార్కింగ్ సమస్య అతిపెద్ద సమస్యగా మారింది. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాలైన రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లిలో ఈ సమస్య పట్టి పీడిస్తోంది.

పట్టించుకోని అధికారులు

రామవరప్పాడు బల్లెంవారి వీధిలో, ఎనికేపాడు బీవీ రావు కల్యాణ మండపం ఎదురు సర్వీసు రోడ్డు, నిడమానూరు, గూడవల్లి జాతీయ రహదారిపై నిత్యం భారీ వాహనాలు, లారీలను అనధికారంగా పార్కింగ్ చేస్తున్నారు. నానాటికీ సమస్య తీవ్రతరమవుతున్నా సంబంధిత అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. రామవరప్పాడు బల్లెం వారి వీధిలో ఏలూరు జాతీయ రహదారి నుంచి ఆటోనగర్ కలిసే రహదారిపై నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆటోనగర్‌లో భారీ లారీలు, మరమ్మతులకు గురైన బాడీ లారీలు, ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులకు ఈ రహదారి పార్కింగ్ ప్లేస్‌గా తయారైంది. అలాగే ఎనికేపాడు బీవీ రావు కల్యాణ మండపం ఎదురు సర్వీసు రోడ్డు కూడా అనధికార పార్కింగ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. బయటి ప్రాంతాల నుంచి వచ్చే లారీ డ్రైవర్లు, క్లీనర్లు ఈ వాహనాల కిందే నిద్రపోవడం, వంట చేసుకోవడం, మద్యం సేవించడం, జూదమాడటం వంటి చర్యలకు పాల్పడుతూ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి జాతీయ రహదారిపై అనధికార పార్కింగ్‌ల వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. గడిచిన 2 నెలల్లోనే అనధికార పార్కింగ్‌ల వల్ల చోటు చేసుకున్న ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడగా, పదుల సంఖ్యలో క్షతగాత్రులైన ఘటనలు ఉన్నాయి.

నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం

అనధికార పార్కింగ్‌ల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారికి ఇరువైపులా వాహనాలు పార్కింగ్ చేస్తుండటంతో రహదారి ఇరుగ్గా మారి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ వల్ల గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

టపాసు విక్రయదారులు నిబంధనలు పాటించాలి

తహసీల్దార్ వి. భావన్నారాయణ

కంకిపాడు: టపాసు విక్రయ దుకాణదారులు నిబంధనలు పాటించాలని తహసీల్దార్ వి. భావన్నారాయణ సూచించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దీపావళి పండుగ సందర్భంగా టపాసుల విక్రయదారులకు తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు విక్రయదారులు తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు సమర్పించాలన్నారు. 27వ తేదీ ఉయ్యూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఆమోదం, 29న లైసెన్సుల పంపిణీ జరుగుతుందన్నారు. 29, 30వ తేదీల్లో రెండు రోజులకు టపాసుల విక్రయాలకు తాత్కాలిక లైసెన్సులు జారీ చేస్తామన్నారు. దుకాణదారులు ప్రమాదాల నివారణ చర్యలు, నిబంధనలు పాటించాలని స్పష్టంచేశారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



కంకిపాడు: భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం కల్పిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుందని తహసీల్దార్ వి. భావన్నారాయణ అన్నారు. కొణతనపాడు గ్రామంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో స్థానికులు తమ భూములకు సంబంధించిన సమస్యలు, రీ సర్వేలో గుర్తించిన అంశాలను అర్జీల రూపంలో సమర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రీ సర్వేలో పేర్కొన్న నిబంధనల మేరకు భూ సమస్యలకు ప్రాధాన్యం కల్పించి 15 రోజుల్లోపు పరిష్కరించేలా సిబ్బందికి ఆదేశాలిచ్చామని వివరించారు. సభలో ఎంపీటీసీ సభ్యుడు బి. సురేష్, ఈఓ రామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో నకిలీ డీజిల్ అమ్మకాలు.!

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక విజయవాడరోడ్డులోని భారత్ పెట్రోలియం బంకులో నీళ్లను తలపించేలా డీజిల్ ఉంది. దీంతో పెట్రోల్ బంకు సిబ్బందిని ఒక వినియోగదారుడు ప్రశ్నించడంతో పొంతనలేని సమాధానం ఇచ్చారు. దీంతో పెట్రోల్ బంకులోని పరిస్థితిని, నీళ్లలా ఉన్న డీజిల్ బాటిల్‌ను చూపుతూ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు స్పందించారు. బాపులపాడు రెవెన్యూ అధికారులు పెట్రోల్ బంకును తనిఖీ చేయడంతోపాటు తక్షణమే అమ్మకాలు నిలిపేశారు. పౌరసరఫరాల శాఖ అధికారులు పెట్రోల్ బంకులో డీజిల్ శాంపిల్స్‌ను సేకరించారు. పెట్రోల్, డీజిల్ శాంపిల్స్‌ను ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాత బంకు యాజమాన్యంపై తగు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

శివాలయం పక్కనే వైన్‌షాపు



శివాలయం పక్కనే ఉన్న వైన్‌షాపు

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు వద్ద శివాలయం పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేయడంపై భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి కేవలం కూతవేటు దూరంలోనే మద్యం దుకాణం ఉండటంతో భక్తులకు ఇబ్బందిగా మారింది. పర్మిట్ రూమ్ అనుమతి లేకపోయినప్పటికి వైన్‌షాపు ఆవరణలో కుర్చీలు, బల్లలు, మంచాలు వేసి మందుబాబులకు సకల సదుపాయలు కల్పిస్తున్నారు. అయితే పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం టీడీపీ నేతలకు చెందిన ఈ వైన్‌షాపు వైపు కన్నెత్తి చూడటం లేదు. కార్తిక మాసం సమీపిస్తున్న దృష్ట్యా ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆధ్యాత్మిక ప్రాంతంలో ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

చేపల పెంపకంలో సమీకృత పద్ధతులు అవసరం



మత్స్యకారులకు వలలు, ట్రేలు అందజేస్తున్న మత్స్యశాఖ ప్రతినిధులు

కంకిపాడు: చేపల పెంపకంలో ఆధునిక, సమీకృత పద్ధతులు అవలంబించాలని రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్(ఆర్‌జీసీఏ) ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ అప్పలనాయుడు, బావుదేవరపల్లి మత్స్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. ఐసీఏఆర్-సీఐఎఫ్ఏ, ఆర్ఆర్‌సీ విజయవాడ ఆధ్వర్యంలో ఆధునిక విధానంలో సమీకృత చేపల పెంపకంపై మండలంలోని కోలవెన్ను గ్రామంలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకూ మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం మత్స్యకారులకు వలలు, ట్రేలు, కోళ్ల పెంపకం దారులకు కోడిపిల్లలు అందించారు. మూడు రోజుల పాటు ఔత్సాహికులకు ఆధునిక సమీకృత విధానంలో చేపల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో డాక్టర్ అప్పలనాయుడు, డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మత్స్యశాఖ సూచనలు పాటిస్తూ యాజమాన్య చర్యలు చేపట్టాలని, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్ఆర్‌సీ, విజయవాడ శాస్త్రవేత్త, సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ రమేష్ రాథోడ్, శాస్త్రవేత్త డాక్టర్ అజిత్‌కౌశవ్‌చౌదరి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాన్ని మత్స్య అభివృద్ధి అధికారి వి. మంజూషా పర్యవేక్షించారు.

పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విగ్గిన్స్, పక్కన తహసీల్దార్ సుగుణ

విజయవాడరూరల్: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి డిగ్రీ ఉత్తీర్ణులైన వారిని ఓటర్లుగా నమోదు చేయాలని విజయవాడ రూరల్ ఎంపీడీఓ బి. విగ్గిన్స్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బూత్ స్థాయి అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో డిగ్రీ ఉత్తీర్ణులైన వారి ఇంటికి వెళ్లి ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. తహసీల్దార్ బి. సుగుణ మాట్లాడుతూ దరఖాస్తులను నవంబరు 6వ తేదీలోపు అందజేయాలన్నారు. గత గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు కోసం దరఖాస్తు చేసిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బూత్‌స్థాయి అధికారులుగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు ఈ సమావేశానికి హాజరుకాలేదు. వారి స్థానంలో సచివాలయ సిబ్బందిని నియమించే అవకాశం ఉందని ఎంపీడీఓ తెలిపారు.

గన్నవరం: కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి విజయం కోసం పార్టీ శ్రేణులు పాటుపడాలని కోరారు.

పూర్వ విద్యార్థులు పాఠశాలకు తరగని సంపద



పాఠశాలలో వేదిక నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

గన్నవరం రూరల్: పూర్వ విద్యార్థులు పాఠశాలలకు తరగని సంపద అని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శ్రీపతి వెంకట రామ్‌గోపాల్ పేర్కొన్నారు. 1985-86 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక హైస్కూల్‌లో విద్యార్థుల సౌకర్యార్థం రూ. 5లక్షలతో వేదిక(కళా మండపం) నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు చిత్తశుద్ధి, అంకిత భావంతో భవిష్యత్ తరాల వారికి ఉపయోగపడే విధంగా వేదిక నిర్మించడం అభినందనీయమన్నారు. విశ్రాంత హెచ్ఎం ఎంవీ సుబ్బారావు పూర్వ విద్యార్థుల వితరణను కొనియాడారు. పూర్వ విద్యార్థులు కందిమళ్ల శ్రీనివాసరావు, చిన్ని, ఎన్. శ్రీనివాసరావు, చిమట ఏడుకొండలు, లక్ష్మి, ప్రకాష్, సర్పంచ్ వి.రాధాకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు షేక్ మున్ని, విద్యా కమిటీ ఛైర్మన్ ముస్తఫా వలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



వేలేరులో సీసీ రోడ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామీణ రహదారుల అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాపులపాడు మండలం వేలేరులో ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్, గ్రామ పంచాయతీ నిధులు రూ. 85 లక్షలతో చేపట్టిన పలు అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి జెడ్పీ హైస్కూల్ రోడ్డు, పిన్నమనేని గ్రామీణ వైద్యశాల రోడ్డు, శ్రీవిద్య కాన్వెంట్ రోడ్డు, కొత్త వేలేరులో ఆంజనేయస్వామి రోడ్డు నిర్మాణ పనులను డీఈ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. పంచాయతీ రాజ్ ఏఈ డి. జయరాజు, గ్రామ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సంతోష్, మాజీ సర్పంచ్ వేములపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోళ్ల శివ నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘన

- అనుమతులు లేకుండా టపాసుల విక్రయదుకాణం ఏర్పాటు
- దుకాణం మూసివేయించిన అధికారులు



కంకిపాడు రైతుబజారు వద్ద ఏర్పాటు చేసిన టపాసుల విక్రయ దుకాణం

కంకిపాడు: అధికార అండదండలతో నేతలు నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. పూర్తి స్థాయి అనుమతులు, స్థల నిర్ధారణ జరగక ముందే నిత్యం జనసంచారం అధికంగా ఉండే రైతుబజారు ఎదుట అట్టహాసంగా దుకాణం ఏర్పాటుచేయడం వివాదాస్పదమైంది. ఈ అంశంపై సామాజిక మాధ్యమాల వేదికగా స్థానికులు, దుకాణదారుల మధ్య వాగ్వాదాలు జరగడం గమనార్హం. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో ఎన్ఓసీ ఇచ్చామని, దుకాణం తెరిచే సమయానికి అనుమతులు చూపాలని అడిగామని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. అయితే సామాజిక మాధ్యమాల్లో నిబంధనల ఉల్లంఘనపై విస్తృత ప్రచారం జరగడంతో అధికారులు కదిలారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వి. భావన్నారాయణ రెవెన్యూ, పోలీసు శాఖలు, మండల కమిటీ ప్రతినిధులతో కలిసి టపాసు విక్రయ దుకాణం ఏర్పాటుచేసిన ప్రదేశానికి వెళ్లి దుకాణ నిర్వాహకులతో చర్చించారు. పూర్తి అనుమతులు వచ్చినా, తాము నిర్దేశించిన ప్రాంతంలో దుకాణం ఏర్పాటు చేసుకోవాలని, పండుగ ముందు రెండు రోజులు పాటు టపాసుల విక్రయాలకు అనుమతి ఇస్తామని, దుకాణం మూసివేయాలని ఆదేశించారు. దుకాణంలో ఏర్పాటు చేసిన మందుగుండు సామగ్రిని దుకాణం నుంచి తీసివేయించేలా చర్యలు తీసుకున్నారు.

ముగిసిన ఆధార్ ప్రత్యేక క్యాంపులు

కంకిపాడు: ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులు శుక్రవారంతో ముగిశాయి. ప్రభుత్వ ఆదేశాలతో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకూ ఆధార్ నమోదు ప్రత్యేక క్యాంపులు నిర్వహించారు. ముగింపు రోజైన శుక్రవారం దావులూరు, కోలవెన్ను, వేల్పూరు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆధార్‌లో తప్పులు, సవరణలు, నమోదు అంశాలపై అర్జీలు స్వీకరించి నమోదు చేసుకున్నారు. క్యాంపులను ఎంపీడీఓ పి. అనూష పర్యవేక్షించారు.